# ఎంకిపాటలు

నండూరి సుబ్బారావు



ఎమెస్కో



## ముద్దుల నా యెంకి

గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
కూకుండ నీదురా కూసింతసేపు !
...............................

నాకాసి సూస్తాది నవ్వు నవ్విస్తాది,
యెల్లి మాటాడిస్తె యిసిరికొడతాదీ !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ
...............................

కన్ను గిలికిస్తాది నన్ను బులిపిస్తాది,
దగ్గరన కూకుంటె అగ్గి సూస్తాదీ !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ!
...............................

యీడుండమంటాది యిలుదూరిపోతాది,
యిసిగించి యిసిగించి వుసురోసుకుందీ !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ!
...............................

మందో మాకో యెట్టి మరిగించినాదీ,
పల్లకుందామంటె పాణ మాగదురా !
గుండె గొంతుకలోన కొట్లాడుతాదీ!
...............................




## వానలచ్చిమి

జాము రేతిరి యేళ జడుపు గిడుపూ మాని
సెట్టు పుట్టా దాటి సేనులో నేనుంటె
          మెల్లంగ వస్తాది నాయెంకీ !
          సల్లంగ వస్తాది నాయెంకీ !
పచ్చన్ని సేలోకి పండు యెన్నెల్లోన
నీలి సీరాగట్టి నీటు గొస్తావుంటె
          వొయ్యార మొలికించు నాయెంకీ !
          వానలచ్చి మనిపించు నాయెంకీ !
యెంకి వస్తాదాని యెదురూగ నేబోయి
గట్టుమీదా దాని కంటి కాపడగానె
          కాలు కదపాలేదు నాయెంకీ !
          కరిగి నీ రౌతాది నాయెంకీ !
మాటలన్నీ సెప్పి మంచెకిందా కెల్లి
గోనెపట్టా యేసి గొంగడీ పైనేసి
          కూలాసగుంటాది నాయెంకీ !
          కులుకు సూపెడతాది నాయెంకీ !
యేతా మెత్తేకాడ యెదురూగ కూకుండి-
మల్లీ యెప్పటల్లె తెల్లారబోతుంటె-
          సెందురుణ్ణీ తిట్టు నాయెంకీ !
          సూరియుణ్ణీ తిట్టు నాయెంకీ !




## యెంకి ముచ్చట్లు

యెన్నాని సెప్పేది యెంకి ముచ్చట్లు
యేటి సెప్పేది నా యెంకి ముచ్చట్లు ?
        దొడ్డి తోవ కళ్ళె తొంగి సూడంగానె
        'తోటకాడే వుండు తొరగొస్త' నంటాది !
యెన్నాని సెప్పేది.........
        యెంకి రాలేదాని యేటొ సూత్తావుంటె
        యెనకాలగా వచ్చి 'యెవురు వో'రంటాది !
యెన్నాని సెప్పేది.......
        'సిట్టీ సేబా'సాని నిట్టూర మేత్తుంటె
        మాటా యినబడనట్టు మరియేటొ సెపుతాది !
యెన్నాని సెప్పేది.......
        'కోడి గూసేసరికి కొంపకెల్లాలి, నీ
        కోసరమె సెపుతాను కోప మొ'ద్దంటాది !
యెన్నాని సెప్పేది.....
        'యెంతసే పున్నాను యిడిసిపెట్టాలేవు
        తగువోళ్లలో మనకి తలవొంపు' లంటాది !
యెన్నాని సెప్పేది.....
        యెన కెనక సూత్తానె యెల్లుతావుంటాది,
        యెన్నాని సెప్పేది యెంకి ముచ్చట్లు
        యేటి సెప్పేది నా యెంకి ముచ్చట్లు ?



## యెంకితో తిరపతి

యెంకీ, నాతోటీ రాయే !
మన
యెంకటేశరుణ్ణి యెల్లీ సూసొద్దాము !
ఆవుల్ని దూడల్ని
అత్తోరి కాడుంచి,
మూటా ముల్లీ గట్టి,
ముసిలోళ్ళతో సెప్పి,
యెంకీ, నాతోటీ రాయే......
ఆ సామి మీ దేటొ
వూసూ లాడుకొంట,
కొండ మెట్లన్నీ నీ
కొంగట్టు కెక్కాలి,
యెంకీ, నాతోటి రాయే......
'రేతిరి పగటేల
రెప్పెయ్య కెంకీని
సల్లంగ సూడ' మని
సామితో జెప్పాలి,
యెంకీ నాతోటి రాయే......



## సత్తెకాలపు నాయెంకి

“నీతోటే వుంటాను నాయుడు బావా!
నీమాటే యింటాను నాయుడు బావా!”
“సరుకు లేమికావాలె సంతన పిల్లా?”
“నువ్వు
మరమమిడిసి మనసియ్యి నాయుడు బావా!”
“సక్కదనమున కేమిత్తు సంతన పిల్లా?”
“నువ్వు
సల్లగుండు పద్దాక నాయుడు బావా!”
“యేడనే నీ కాపురమో యెల్తురు పిల్లా?”
“నీ
నీడలోన మేడ కడతా నాయుడు బావా!’’
‘‘నీతోటె వుంటాను నాయుడు బావా!
నీ మాటె యింటాను నాయుడు బావా!”